## క్లుప్తంగా

### 'మిలాద్ ఉన్ నబీ'కి కళాత్మక శుభాకాంక్షలు



ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీలో ఉన్న సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం బుధవారం మొక్కజొన్న పొత్తులపై 'మిలాద్ ఉన్ నబీ' పర్వదిన చిత్రాలను రూపొందించారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా సూక్ష్మ కుంచెతో ముస్లింల ప్రార్థన మందిరాల చిత్రాలను ఆవిష్కరించి కళాత్మక శుభాకాంక్షలు తెలిపారు.

### కోవూరులో భారీ వర్షం

- విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు : కోవూరు మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అంతే కాకుండా పిడుగుపాటుకు విద్యుత్ హెవీలైన్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

కోవూరు : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ టి.పార్వతి అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో విలువైన మందులు అందుబాటులో ఉన్నాయని, ఖరీదైన రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగానే గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు టి.సుజాత, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మీకుమారి, డాక్టర్ విజేత, మాళవిక, చలపతిగౌడ్, పెంచలయ్య, సలావుద్దీన్ పాల్గొన్నారు.


### డీకేడబ్ల్యూలో ఆర్నమెంటల్ ఫిషరీ కోర్సు ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరించిన అధ్యాపకులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగాల ఆధ్వర్యంలో ఆర్నమెంటల్ ఫిషరీ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి తెలిపారు. బుధవారం కళాశాలలో కోర్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సులో ఆర్నమెంటల్ చేపల పెంపకంపై సమగ్రంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులో చేరేందుకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు, గృహిణులు అర్హులని చెప్పారు. కోర్సు వ్యవధి రెండు నెలలు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు జువాలజీ హెచ్‌ఓడీ రంజని 94913 21150 నంబరులో సంప్రదించాలని సూచించారు.

### షిర్డీ సాయినాథుడికి ఇరుముడుల సమర్పణ



నెల్లూరు(బృందావనం): సింహపురికి చెందిన 200 మంది సాయిబాబా భక్తులు షిర్డీలో సాయినాథుడికి బుధవారం ఇరుముడులు సమర్పించారు. పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం చైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో సాయి మాలధారణతో షిర్డీకి వెళ్లిన భక్తులు సాయిబాబా మందిరం చుట్టూ మహాప్రదక్షిణ చేసి చావడి, ద్వారకామాయి మీదుగా సమాధి మందిరంలోని బాబా సమాధిని దర్శించుకుని ఇరుముడిని బాబా పాదాలకు స్పృశింపజేశారు. అనంతరం అక్కడి నుంచి గురుస్థాన్, నందదీపం చుట్టూ ప్రదక్షిణలు చేసి మందిరం ప్రాంగణంలోని వేప,రావి వృక్షాల వద్ద ఇరుముడిని సమర్పించారు. అనంతరం షిర్డీ సంస్థాన్ వేదికపై సాయి నామ సంకీర్తన చేశారు. గురువారం షిర్డీ పుర వీధుల్లో సింహపురి భక్తుల ఆధ్వర్యంలో సాయిబాబా పల్లకి ఉత్సవం నిర్వహించనున్నట్లు మధుసాయి తెలిపారు.

# సారారహిత గ్రామాలే లక్ష్యంగా..

నాటుసారా స్థావరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సారా స్థావరాలపై ముమ్మరంగా దాడులు చేసి సారారహిత గ్రామాలుగా గుర్తింపు తీసుకొచ్చారు. అయితే ఇటీవల పండగల నేపథ్యంలో మళ్లీ సారా స్థావరాలు వెలుస్తున్నాయి. దీంతో సెబ్ అధికారులు విస్తృతంగా దాడులు చేసి సారా స్థావరాలను కట్టడి చేస్తున్నారు.

- కొద్దినెలల విరామం తర్వాత మళ్లీ సారా తయారీ
- కట్టడి చేస్తామంటున్న సెబ్ అధికారులు
- విస్తృతంగా దాడులు చేపడుతున్న వైనం



ఇటీవల బిరదవోలు అటవీప్రాంతంలో బట్టీలను గుర్తించిన సెబ్ అధికారులు



ప్లాస్టిక్ డ్రమ్ముల్లో రసాయనాలతో కలిపిన బెల్లపుఊట



సారా స్థావరాలు గుర్తించేందుకు సిద్ధమవుతున్న పోలీసు, సెబ్ అధికారులు (ఫైల్)

పొదలకూరు : మండలంలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన కొందరు నాటుసారా తయారీని జీవనాధారంగా మార్చుకున్నారు. అయితే ప్రభుత్వం సెబ్ అధికారులకు ఇలాంటి గ్రామాలను దత్తత తీసుకుని వారి జీవన విధానంలో మార్పులు తీసుకురావాలని ఆదేశించడంతో సెబ్ ఏఈఎస్ కృష్ణకిశోర్ బిరదవోలు, బ్రాహ్మణపల్లి గ్రామాలను దత్తత తీసుకున్నారు. నాటుసారా కాసే వారిలో చాలావరకు మార్పులు తీసుకొచ్చారు. ఇందుకోసం ఈ ఏడాది జనవరిలో పలుమార్లు ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మహిళల్లో చైతన్యం తీసుకొచ్చారు. పొదుపు సంఘాల సభ్యులతో మాట్లాడి సారా స్థావరాలు నిర్వహిస్తే సమాచారం అందజేయాల్సిందిగా కోరారు. ఇందుకోసం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సైతం సెబ్ అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందివ్వడంతో పాటు పేదల ప్రాణాలు హరించే నాటుసారా తయారీ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. క్రమేణా అధికారుల దాడులు పెరగడం, కేసులు నమోదు చేస్తుండడంతో నాటుసారా తయారీని నిలిపివేశారు.

**మళ్లీ సారా తయారీవైపు..**

వినాయక చవితి ముందు వరకు బిరదవోలు, బ్రాహ్మణపల్లి గ్రామాలు సారా రహిత గ్రామాలుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. భవిష్యత్తులో వారిలో మార్పు కోసం ప్రభుత్వం నుంచి రుణాలు ఇప్పించి చైతన్యం తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్న తరుణంలో మళ్లీ సారా తయారు చేస్తున్నారు. అయితే పండగ సందర్భంగా మళ్లీ నాటుసారా స్థావరాలు వెలిశాయి. కొందరు యువకులు సంపాదన కోసం సారా తయారు చేస్తున్నట్లు సెబ్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బడుగు రమేష్ అనే యువకుడు వినాయక చవితి ఉత్సవాల్లో సారా తయారు చేస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రామాలకు చెందిన మరికొందరు తిరిగి నాటుసారా తయారు చేస్తున్నట్లు అధికారుల వద్ద సమాచారం ఉంది.

**అనువైన అటవీప్రాంతం**

బిరదవోలు, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల వారు నాటుసారా తయారు చేసేందుకు అనువుగా అటవీ ప్రాంతం ఉంది. దీంతో బట్టీలను ఏర్పాటు చేసి సారాను తయారు చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. లీటరు సారాను రూ.500 అమ్ముతున్నట్లు సమాచారం. దశాబ్దాలుగా నాటుసారా తయారీకి అలవాటు పడిన వారు తరచుగా బట్టీలను ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. మద్యంతో పోలిస్తే సారా ధర తక్కువగా ఉండడం వల్ల కొందరు కొనుగోలు చేస్తున్నారు.

**నాటుసారాను అరికడుతాం**

సారా రహిత గ్రామాలుగా ఉన్న బ్రాహ్మణపల్లి, బిరదవోలులో ప్రస్తుతం కొందరు తిరిగి సారా తయారు చేస్తున్నారు. వారి వివరాలు మా వద్ద ఉన్నాయి. త్వరలో వారిని అదుపులోకి తీసుకుని సారా తయారీని అరికడుతాం. స్థానికులు సహకరించి సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– వెంకటరావు, సెబ్ సీఐ, పొదలకూరు

# యాజమాన్య పద్ధతులు పాటించాలి

- రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ అవసరం
- ఏడీఏ మారుతీదేవి



మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

మనుబోలు : రైతులు పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మారుతిదేవి సూచించారు. మనుబోలు సచివాలయం–2 పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కాండం తొలచు పురుగు నివారణకు పైరు దశలో గుళికలు వాడితే ఖర్చు ఎక్కువ అవుతుందని, దానికి బదులుగా వరినాట్లు వేసే వారం ముందు పొలంలో గుళికలు వేయాలన్నారు. పొట్టదశలో తెల్లకంకి నివారణకు, చిరు పొట్ట దశలో మెడ విరుపు నివారణకు ఏ మోతాదుల్లో ఎరువులు వాడాలో రైతులకు సూచించారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యూరియా, జింక్, డీఏపీలు తగిన మోతాదులోనే వాడాలన్నారు. ఈ సదస్సులో ఏఓలు జహీర్, గీతా మాధురి, ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సైంటిస్ట్ తేజస్విని, ఏఈఓ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఓబులేసు

మనుబోలు : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ కలెక్టర్ ఓబులేసు వైద్య సిబ్బందికి సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో బుధవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య స్థితిగతులు, వారికందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది ఇళ్లకు వచ్చి అవసరమైన మందులు అందజేస్తున్నారా.. అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సర్వే సందర్భంగా ఎలాంటి ప్రశ్నలు అడగాలి, ఎలాంటి డేటా సేకరించాలో వైద్య సిబ్బందికి సూచించారు. అక్టోబర్ 17న గ్రామంలో జరిగే ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను జయప్రదం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి అనిత, ఏఎన్‌ఎం శివరూపిణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు అమ్మవారిపాళెం విద్యార్థినులు



క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థినులతో టీచర్లు

పొదలకూరు : రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు మండలంలోని అమ్మవారిపాళెం జెడ్పీహైస్కూల్ విద్యార్థినులు ఎంపికై నట్లు పీడీ సురేంద్రకుమార్ బుధవారం తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన 67వ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం.అస్మిత అండర్–14 విభాగంలో త్రోబాల్‌కు, అండర్–17 విభాగం పుట్‌బాల్ జట్టుకు నాగినేని పల్లవి, వీరేపల్లి కుసుమ ఎంపికయ్యారు. వీరు త్వరలో కర్నూలు, నంద్యాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు సుభాషిణి, ఖాజారంతుల్లా, విజయభాస్కర్ అభినందించారు.

## శాస్త్రీయ పద్ధతులతో మత్స్యసాగు లాభదాయకం



కోడూరులో జరిగిన వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో అధికారులు

తోటపల్లిగూడూరు : శాస్త్రీయ పద్ధతులతో మత్స్య సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని ఇందుకూరుపేట డివిజన్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి(ఎఫ్‌డీఓ) సంజయ్ స్టీఫెన్ పేర్కొన్నారు. వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో భాగంగా కోడూరు గ్రామంలోని కావలిరెడ్డి రంగారెడ్డి రొయ్యలగుంతలను మత్స్యశాఖాధికారులు బుధవారం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ చేపలు, రొయ్యలను సాగు చేసే రైతులకు వైఎస్సార్ మత్స్య సాగుబడి ద్వారా అన్నిరకాల చేయూత అందుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకుని ఆక్వారంగంలో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం మత్స్యశాఖాధికారులు స్థానిక ఆక్వా రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేతలు కావల్‌రెడ్డి రంగారెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ సుప్రియ, సాగర మిత్రలు పాల్గొన్నారు.

### పొదలకూరు సీహెచ్‌సీకి ఫిజీషియన్ నియామకం

పొదలకూరు : స్థానిక సీహెచ్‌సీకి కొత్తగా ఫిజీషియన్ డాక్టర్‌ను నియమించారు. ఈ మేరకు సీహెచ్‌సీలో డాక్టర్ రోహిత్ బుధవారం ఫిజీషియన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించారు.

### ప్రభుత్వ సహకారంతో డెయిరీ అభివృద్ధి



కోవూరు : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరు విజయ డెయిరీని లాభాల బాటలో తీసుకెళ్లి అభివృద్ధిని చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విజయ డెయిరీ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి రంగారెడ్డి హాజరై, రైతులనుద్దేశించి మాట్లాడారు. పాడి రైతులకు మేలు జరిగేలా అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డెయిరీ చైర్మన్‌ను రైతులు, బోర్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో డెయిరీ ఎండీ కృష్ణమోహన్, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, భవానీరెడ్డి, దశరథరామిరెడ్డి, సునీల్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్



మాట్లాడుతున్న లలితాశివజ్యోతి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని 25 ప్రభుత్వ పాఠశాలలను కిచెన్‌గార్డెన్స్ పెంపకానికి ఎంపిక చేసినట్లు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి బుధవారం తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు కిచెన్ గార్డెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఎంపిక చేసిన పాఠశాలలకు వచ్చే వారం నుంచి వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కేవీకే శాస్త్రవేత్తలు కిచెన్ గార్డెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

### అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రసన్న

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న బూదూరు ప్రసన్నకు డాక్టరేట్ లభించింది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో జువాలజీ ప్రొఫెసర్ పీ జాకబ్‌దాస్ పర్యవేక్షణలో 'థయోడి కార్బ్ ఇన్‌ఫ్ల్యూయెన్స్ ఆన్ ద సెంట్రల్ నెర్వస్ సిస్టం ఇన్ అల్బినో మైస్' అనే అంశంపై సాగించిన పరిశోధనలకు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

# ఘనంగా గణేశ్ నిమజ్జనోత్సవం



ముత్తుకూరు : బ్రహ్మదేవి నుంచి ఘనంగా తరలుతున్న గణనాథుని విగ్రహం

ముత్తుకూరు : ముత్తుకూరు మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతిష్ఠించిన నాలుగు విగ్రహాలను సముద్రంలో బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. మంగళవారం రాత్రి అందంగా అలంకరించిన వాహనాల్లో రెండు వినాయకుడి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించి బుధవారం ఉదయం బంగాళాఖాతానికి తరలించారు. బాణసంచా కాలుస్తూ, యువకులు రంగులు చల్లుకొంటూ తప్పెట్ల తాళాల మధ్య సాయంత్రం మరో రెండు విగ్రహాలను సముద్రం వద్దకు తరలించే ప్రక్రియ చేపట్టారు.

**కోలాహలంగా..**

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు, కాటేపల్లి తీరప్రాంతాల్లో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని మండపాల్లో కొలువుదీరిన గణనాథుల విగ్రహాల నిమజ్జనం బుధవారం కూడా కొనసాగింది. జిల్లా నలువైపుల నుంచి గణనాథులు తరలి వస్తుండడంతో కోడూరు, కాటేపల్లి సాగర తీరాల్లో పండగ వాతావరణం నెలకొంది. దీంతో బీచ్‌లో స్థానిక పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



తోటపల్లిగూడూరు : సాలిపేట సెంటర్‌లో భక్తుల కోలాహలం నడుమ సాగుతున్న గణనాథుని గ్రామోత్సవం

# చేనేత మగ్గాల పరిశీలన



మగ్గాన్ని పరిశీలిస్తున్న ఏడీ ఆనందరావు

పొదలకూరు : పట్టణంలోని చేనేత కార్మికుల మగ్గాలను చేనేత, జౌళిశాఖ ఏడీ ఎ.ఆనందరావు బుధవారం పరిశీలించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ చేనేత మగ్గాలను పరిశీలించి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. దీంతో నేత కార్మికుల మగ్గాలను ఏడీ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నేతలు పముజుల శంకరయ్య, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పొదలకూరు మండలంలో 400 కుటుంబాల వారు చేనేత కార్మికులుగా ఉన్నారని, వారు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరూ లబ్ధిపొందుతున్నట్లు తెలియజేశారు. పట్టణంలో 100 అంకణాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి చేనేత క్లస్టర్ నిర్మిస్తే నేతన్నలకు అండగా ఉంటుందని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# ఉచిత వైద్యశిబిరం తనిఖీ



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

పొదలకూరు : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కార్యక్రమానికి వచ్చేవారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కాగా ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య తనిఖీ చేసి మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# చకచకా విద్యుత్ పనులు



ఈద్గాలో విద్యుత్‌సౌకర్యం కల్పించేందుకు తోలుతున్న స్తంభాలు



వీధిలైట్లను బిగిస్తున్న సిబ్బంది

పొదలకూరు : పట్టణంలో విద్యుత్ సమస్యలు లేకుండా చకచకా పనులు జరుగుతున్నాయి. విద్యుత్ అధికారుల చొరవతో కొత్త స్తంభాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈద్గా చుట్టూ రూ.26 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాగా ఈద్గాలో ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో మంత్రి ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన స్తంభాల నిర్మాణం చేపట్టారు. ఈద్గాలో వెంటనే విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మైనారిటీ నాయకులు ఖాదర్, అంజాద్ తెలియజేశారు. పట్టణంలో వీధిలైట్లు వేసేందుకు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. వీధిలైట్లు లేని చోట్ల పంచాయతీ నిర్వాహకులు వెంటనే లైట్లను బిగిస్తున్నారు.

# సోమిరెడ్డివి చిల్లర రాజకీయాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటాచలం : సోమిరెడ్డి చేసేవి చిల్లర రాజకీయాలు అని, ఇకనైనా హుందాతనమైన రాజకీయాలు చేయాలని ఏఎంసీ డైరెక్టర్ చీకుర్తి నరసయ్య హితవు పలికారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ హయాంలో రైతురథం, నీరు– చెట్టు పేరుతో ఇష్టారాజ్యంగా దోచుకున్న హీనచరిత్ర సోమిరెడ్డిదనే విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోమిరెడ్డి టీడీపీ చోటా నేతలతో నిరాధారమైన ఆరోపణలు చేయించడం సిగ్గు చేటన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ సర్వేపల్లిలో సోమిరెడ్డిని ప్రజలు చిత్తు ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో కసుమూరు సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు మందా కృష్ణ పాల్గొన్నారు.